# సంఘ సేవ

"దాత అనగా యెవరూ?"

శిష్యుడు కొండయ్య ప్రశ్నకి శర్మ చిరునవ్వు చిందించాడు, వాళ్ళిద్దరూ వొక యీడు వాళ్ళే. శర్మ ఇంగ్లీష్ మీడియమ్‌తో చదివి, సైన్సు తీసుకుని రిసెర్చి స్కాలర్ అయినాడు కొండయ్య తెలుగు మీడియమ్‌తో చదివి బియెలో దెబ్బ తిన్నాడు. అప్పటినించీ శర్మచేత ట్యూషన్ చెప్పించుకుంటూ యెమ్మేలో చేరాడు. ఇద్దరూ సింహాచలం నించి రోజూ బస్సులో వచ్చేవారు.

రాస్తామీద రద్దీగా వున్నది, వాహనాల ధ్వనులు వింటూ శర్మ జవాబివ్వలేదు, ఈమధ్య తనకు నోరు తిన్నగా రావటం లేదు కొండయ్యను నొప్పిస్తే ట్యూషన్ పోతుంది, రిసెర్చి టైమ్ మూడేళ్లు గిర్రున తిరిగినై, యీడాదినించీ స్కాలర్‌షిప్ లేదు, థీసిస్ పూర్తిగాలేదు, డాక్టరేట్‌కోసం తపస్సు చేస్తున్నాడు శర్మ, అన్న గతప్రాణి గనక, తిండిమాత్రం తింటూ, తక్కిన వాటిని వెలివేశాడు, పార్వతి శివుడిని పెళ్లాడగోరినట్టు విదేశంలో జాబ్ చెయ్యాలని కోరిక.

కొండయ్య, 'చెప్పవేం' అని రెట్టించాడు.

'అమాట కర్థం నీకు తోచినట్టు చెప్పుకుందూ, నన్ను విసిగించకివాళ' పరాకుగా అన్నాడు శర్మ.

'చెప్పు, పాసుమార్కులు రావద్దా? న్యాయంగా నే రావాలి.'

"న్యాయంగా రావాలా? ఇహ నువ్వు యెమ్మే డిగ్రీ కొట్ట లేవు" శర్మ సాపేక్ష సిద్ధాంతం టెక్స్టుకింద పెట్టేశాడు, వినోదంగా కొండయ్య వంక చూశాడు.

'ఈ ఒక్కసారికీ చెప్పు, దాత అనగా?'

'మీనాన్న బంగారం, వ్యాపారంమీద, లక్షలార్జిస్తు వో నయాపైసా ముష్టివాడికీ, మూడురూపాయలు యాడాదికోసారి రెడ్ క్రాస్ వారికీ దానంచేస్తాడు, ఆయన గొప్పదాత' నవ్వు తున్నాడు.

'మానాన్న మీదికి లేచావేం, ఆయన నీకేం ద్రోహం చేశాడు?' శిష్యుని ప్రశ్న.

"నీకు చదువు చెపుతున్నట్టు నటించి, పరీక్ష పాసైనాడూ కొండయ్యా, అనిపించుకున్నాడు."

"అది ద్రోహం కాదే, నీ అవసరాలు చూస్తున్నాడు రూమిప్పించాడు."

'యెన్నాళ్ళు చూస్తాడు? అక్కర తీరేవరకూ, ఆపైన వో పైసా పుట్టదు.'

"నీవు యివ్వగలిగినది నువ్వూ దాచుకోటం లేదూ? నాకు గిట్టు బాటయెటంత నేర్పుతున్నావా? నువ్వూ మాలోనే జమ"

"ధన్యోస్మి, నిమిషంలో మిలియనీరు పక్కనున్నాను,"

"చెప్పెదూ, దాత అనగా,"

"ఇండస్ట్రియల్ ఎంపైర్స్ నడిపేవా, తాము కోట్లల్లో లాభాలు పొందుతూ, వుదారంగా యిచ్చినట్టు ఓ పదివేలు కాషాయాంబధారికిచ్చి, మతాన్ని వుద్ధరిస్తున్నాము, డివైడ్ సాంచ్ వ్యాప్తిలోకి తెస్తున్నాము అంటారు, సవాలక్ష ప్రశ్నలేయకుండా, బస్తాడు సర్టిపికేట్లు రికమండేషన్లూ చూడకండా గబీమని యిచ్చేసేవాడిసెవరూ చెప్పకోరు.'

కొండయ్యకూ నవ్వువచ్చింది. కమ్యూనిస్టులాగా చెపతున్నావు, లాభాలు కంటజూసేవాళ్ళని తిడుతున్నావు.

"అంత తేలిగ్గా నన్ను 'కమ్యూనిస్ట్' అనకు."

'యేం అంటే? నీ పరువు పోయిందా?'

మేమంటే మోటుమనుషులం గనక, కమ్యూనిజం మా మధ్య కొచ్చింది, మీ మధ్యకు రాదు, వచ్చినా వుండదు.' అని స్టాలిన్ వో యింగ్లీషు వాడితో అన్నాడట, మనకు యింగ్లీషు పాలనా వాసన యింకా వదల్లేదు.

'వోవేళ వచ్చిందనుకో, యెందుకనుండదూ?'

'తమకున్న దానిని అందరికీ పంచటానికి యెవరికీ ప్రాణం వొప్పదు. రష్యాలో నే మొదట్లో చాలామంది తమ గొడ్లనీ, పక్షులనీ చంపనన్నా చంపుకున్నారట గాని, సమిష్టిగా అభివృద్ధి జెంది ఫలసాయం సమానంగా పంచుకోటానికి ముందుకు రాలేదుట.'

'నువ్వూ నీ తెలివితేటల్నీ, వృథా చేసుకుంటావుగాని, నాకు పంచి యివ్వటానికి ముందుకు రావటంలేదివాళ.'

శర్మ కొండయ్య తెలివికి సంతోషించాడు.

'నువ్వెక్కడ దాపురించావోయ్, నామేనత్తల్లే నా నెత్తి నెక్కి హక్కు ప్రకటిస్తున్నావేం?'

యెవరామేనత్త? యెప్పుడెక్కింది?

ఆవిడ సిసలైన సంఘసేవిక, నువ్వు వద్దంటున్నా నీకు సేవ చేస్తానంటూ వస్తుంది, యెవరివద్ద డబ్బు పేరుకుంటున్నదీ, యెవరారోగ్యంగా వున్నారూ, అని యోగదృష్టితో కనిపెడుతుంది అలా యెవరి దోవన వారు బాగుపడి ఆరోగ్యంగా వుండటం, సంఘద్రోహంగా తీర్మానిస్తుంది ఆ డబ్బునీ ఆరోగ్యాన్నీ పంచుకోటానికీ, వీలుంటే పంచి యింకోకరికూడా యిప్పించటానికీ వచ్చేస్తుంది యిలా నవ్వుతూ పేలుతున్న శర్మ రోడ్డుమీద ఆగే బండిని చూశాడు.

"అదుగో బండి, మా అత్తయ్యేరానే వచ్చింది. యింకె వరొస్తారంత చొరవగా!" గాభరాగా లేచి తాళంచెవి కొండయ్య జేబుతో జారవిడిచాడు. గోడమేకు కున్న షర్టుతీసి తలమీదుగా కిందకి వేసుకున్నాడు.

"కొండా! మాఅత్తయ్య మాటల్లోనే వచ్చింది. ఆవిడకి నూరేళ్ళాయుష్షు, గదిలో లేడని చెప్పు, గదికి తాళంవేసి రీడింగ్ రూమ్‌కిరా. అక్కడ నీకు చదువు నూరిపోస్తా." శర్మ మెట్లు దూకి మరోగేటు గుండా రోడ్డెక్కి జనంలో కలిసిపోయాడు.

మార్చినెల చివర, యెండలు కొంత తీవ్రంగానే వున్నాయి. వచ్చే వుపద్రవం తెలియని కొండయ్య మేకపిల్లలాగా చూస్తూ గదిలోనే వున్నాడు.

'బండెబ్బాయ్! ఇక్కడే అపు, అపు.'

జట్కావాలా కళ్లాలు లాగి, బక్కచిక్కిన గుఱ్ఱాన్ని గది ముందుఆపాడు. జానికమ్మత్తయ్య కుడిపాదం బైటబెట్టి దిగింది గది వున్నది మేనల్లుడవునా కాదా అనన్నా పరిశీలించలేదు. మెట్లెక్కి వస్తూ కొంగుముడి పంటితో వూడ దీసింది, బండి బాడుగ సరిపోయేదిలేదు.

"ఇదుగో చూడు నాయనా! నువ్వు స్నేహితుడివేనా? బాడుగ ఒకర్ధరూపాయి తక్కువైంది. శర్మ లేడూ? వచ్చాక అడిగిస్తా యియ్యి, పాపం బండివాడు మరోబాడుగ చూసుకుంటాడు." చెయ్యి జాపింది.

కొండయ్య నిలబడ్డాడు, మంత్రించబడినట్టు, జేబులోని అర్ధరూపాయబిళ్ళ ఆవిడ చేతులో పెట్టాడు.

పాత జంపకానాతో కుట్టిన సంచీలు రెండూ, కొబ్బరినార తాడుతో బంధించబడిన దేశవాళీ బెడ్డింగూ బండివాడు తెచ్చి గదిముందు పడేశాడు. యెర్రపరికిణీ, ఓణీ, జాకట్టూ, జానెడు జానెడు జడలకు యెర్ర రిబ్బన్లూ, పెట్టుకున్నమ్మాయి. చేవుల రింగులాడిస్తూ వచ్చి నిడబడింది. బిగుతు దుస్తులేసుకున్న అబ్బాయి వచ్చాడు.

గదంతా కలయజూసింది అత్తయ్య, కొండయ్యను జూసింది. మొహమాటస్తుడేనని గ్రహించింది, మాటలు విప్పుతూ అన్నది.

'వస్తున్నామని వ్రాశాము, మా శర్మ పనిమీద వూళ్లో కెళ్లాడా? గది పెద్ద రోడ్డుమీద సెంటర్లో వున్నది. మీకేమీ యిబ్బంది వుండదు' అని వ్రాశాడే. స్టేషను నుంచి సరాసరి వచ్చేశాం. ఇవాళ రైలు మూడుగంటలు లేటు, పట్టాలు బాగు చేస్తున్నారట. వీళ్ళిద్దరూ పొద్దుటినించీ పచ్చి మంచినీళ్లెరగరు వీడు శీను, మా అబ్బాయి. బహు భయస్తుడు రైలుదిగి కాఫీ తేటవం గూడా చేయలేదు.

వేలుముడీ, అక్కడక్కడ నెరసిన వెంట్రుకలూ, కాసిబోసి కట్టిన చీరా, మాసిన తెల్లరవికా, చేతులకూ చెవులకూ యేమీ లేవు. మెళ్ళో యిత్తడిదో పుత్తడిదో గొలుసూ, అత్తయ్య విడిగా పెట్టింది.

"ఫ్లాస్కో యేదే సాంబూ, కాఫీ పోయించుకుని వస్తాడబ్బాయి. ఇయ్యి." అన్నది

సాంబ తన చేతికి వేలాడుతున్న ఫ్లాస్కు యిచ్చింది. కొండయ్య కళ్లార్పకుండా చూస్తూ అందుకున్నాడు.

"మేం మీవాళ్ళమే నాయనా, పెడ పెడగా వుండిపోవటం వల్ల నువ్వు నన్ను చూసి వుండవు. ఇది మా అమ్మాయి, నీకు మరదలవుతుంది." అని అత్తయ్య బాంధవ్యం కలగేస్తుంటే సాంబ కిసుక్కున నవ్వింది.

'వీళ్ళిద్దరూ ప్రైవేటుగా పరీక్షకు చదివారు, పరీక్ష రాయటానికి వచ్చారు, యూనివర్శిటీ దగ్గరే నా?' అత్తయ్య మూట లోంచి దిబ్బరొట్టివున్న పళ్లెందీసింది, ముక్కవిరిచి కొండయ్య చేతిలో పెట్టింది. అరిశముక్కలున్న పళ్ళెం యిచ్చింది.

కొండయ్య గది మూయాలని మరిచాడు. దిబ్బరొట్టె తిన్నాడు, అరిశముక్క కొరికాడు, పొట్లం కిటికీలో వుంచాడు. డబ్బులడగటం మరిచాడు, కాఫీ తేవటానికి గది దాటాడు. నలభై యేళ్ళ జానికమ్మత్తయ్య అతని బుజం తట్టి అన్నది.

"వంట చేసేప్పటికాలస్య మవుతుంది. తీపి సరుకేదన్నా వుంటే పొట్లం కట్టించుకురా, నాకు కాదు సుమా, నేనీరైలు గుడ్డలతో తినను, స్నానం చేయాలి."

పొద్దుననగా వెళ్ళిన శర్మ పొద్దూకవచ్చినా రాలేదు. కొండయ్య లైబ్రరీకెళ్ళి వచ్చీ, యూనివర్శిటీకాంటీన్‌లో చూసి వచ్చీ, రెండుసార్లొచ్చి గదికి తాళంవేసే అవకాశమున్నదా అని చూశాడు, లేదు. శర్మచేత చీవాట్లు తప్పవు అనుకుని, కృష్ణపక్షపు చీకట్లో రీడింగు రూమ్‌వేపు వెళ్లాడు.

## 2

ఓ వారం గడిచింది యెటువేపు వెళ్లాలంటే యే బస్సెందుకోవాలో, కొండయ్యనడిగి, తెలుసుకున్నదత్తయ్య. సోమవారం నించీ పరీక్షలు. ఈలోపల సముద్రస్నానం చెయ్యాలని సంకల్పం కలిగిందత్తయ్యకు. "మహోదయాన్కి సముద్రస్నానం చేయుటం పడనేలేదు" అనుకుంటూ అన్నం వండింది.

"సాంబూ! నువ్వూ అన్నయ్యా అన్నందినేస్తే శేనట్లా వెళ్ళి సముద్రస్నానం చేసివస్తా" అన్నది.

'కొండయ్య చేత లెక్కలు చెప్పించుకోమంటివే. లెక్కలిచ్చి వెళ్లాడు. చేసివుంచక పోతే తంతా నన్నాడు' చాపమీద కూచుని వున్న సాంబూ రాలేదు.

'ఆడపిల్లను నిజంగా తనొచ్చాడూ. పూరికేనే అని వుంటాడు. ఆకుల్లో పెట్టిశా.' అన్నది తల్లి.

"నువెప్పుడూ యింతే, యేదీ సరిగా చేయనీయవు, ఇప్పుడెటు పోయి రావాలేమిటి?" సాంబూ యేడుపు మొహము, బుడ్డమీతి పెట్టి లేచివచ్చింది.

యెన్నాళ్ళుంటారో యేమోనని శర్మ రూమ్‌కిపక్కనేవున్న సత్రం గదిలోకి చేరాడు తప్పించుకు తిరుగుతున్నాడు.

ఒక పక్కగా మడతమంచం మీద పడుకుని సినిమా పత్రికలు తిరగేస్తున్న శీను లేచి రాలేదు. తల్లి విసుక్కున్నది మళ్ళీ కేక వేసింది.

"ఇదుగో వచ్చేస్తున్నా, బావా కొండయ్యా వచ్చేవేళైంది. పరీక్ష పేపర్లు చూడాలి, పత్రికలు కాదు, అని లాగేస్తారు. నేనందుకే మనం వేరేమంచి హోటల్లో దిగుదామన్నాను. అప్పుడేనా అన్నం, యెనిమిదే అయింది." శీనువచ్చి విస్తరి ముందు చతికిలబడ్డాడు.

జానికమ్మ తల విసిరింది, 'అంటావు, అంటావు, అనవూ? మీ తాతముల్లె యిచ్చి చచ్చాడూ, అది వాడదాం?' మొదటి వాయ తినేస్తున్నారు, జానికమ్మ అట్లకాడ తిరగేసి, గిన్నెలోని అన్నమంతా యిద్దరికీ తోడేసిది. గిన్నెను పట్టుకున్న తడిపీలికా గిన్నె అవతల పెట్టి వెటకారంగా అన్నది.

'ఈసారన్నా పరీక్ష అయిందనిపిస్తే, వుద్యోగం చేద్దువు గాని, ఆ జీతంతో మేలురకం హోటల్లో దిగుదాం.'

"అప్పుడే యేం వుద్యోగం? నాకు పదాహాళ్ళేగా." శీను సత్యశీలుడు, రైలు వచ్చేప్పుడు జానికమ్మ ప్రయాణికులతో మాట్లాడుతూ, శీనుకు పదిహేను నిండి పదహారు వచ్చిందనటం విన్నాడు, అదే గుర్తు చేశాడు. చల్లలో యెక్కువనీళ్ళు పోసి, చిన్న కవ్వంతో గిలకొట్టి పిల్లలిద్దరిమధ్యా పెట్టింది. విస్తరి అంచున కందిపచ్చడి వుంచింది.

"ఆఁ, ఆఁ పదహారే, పదకొండుగాదూ, ఇరవై యేళ్ళు యేనాడో నిండినై. నేనేదో మసిబూసి మారేడు కాయంటుంటే మీకెవరికీ యిబ్బంది తెలియదు."

బయట యెండ బారెడు యెక్కింది, చిట చిట లాడుతున్నది. సముద్రమెంతదూరమో, స్నానమెక్కడ చేస్తారో, శర్మ మొహం తప్పిస్తున్నాడు. వెంటవచ్చి స్నానం చేయించి తెస్తే యేం పోయింది? చిల్లరన్నా చేతబెట్టడు, జానికమ్మ గదిగడప దాటింది.

'నెయ్యేదే అమ్మా! పచ్చడీ అన్నంతినట మెట్లా, గొంతు దిగదు' పిల్లలు అరిచారు.

'నెయ్యీ లేదు, గొయ్యీలేదు, అవి సిద్ధం చేసేప్పటికే హతమారింది. అట్లాగే మింగేయండి.'

## 3

శర్మ లాబ్‌నించీ, కొండయ్య లైబ్రరీనించీ వచ్చారు, గదికి తాళం, ఇద్దరూ మొహాలు చూసుకున్నారు. శర్మ యెగ తాళి చేస్తూ అన్నాడు.

'యేందోయ్ నీతెలివి? అత్తా, పిల్లలు చుట్టాలింటికెళ్తారుట అంటివి, తాళంచెవి తీసుకుని దగ్గరుంచు కొమ్మంటే యేదీ?' కొండయ్య బుఱ్ఱ గోక్కున్నాడు.

'తాళంచెవి అత్తయ్య కొంగున వున్నది, గురూ! కొంగు దోపుకున్నదామె. కొంగులాగి తాళంతీసుకోమని మీరు చెప్ప లేదు గురూ!'

"నేను చెపితేగాని పరీక్ష రాయనట్టే, నే చెపితేగాని యేమీ చేయలేవా? నిన్నరాత్రి ఆగది యెవరో ఆక్రమించారు. వళ్ళు నెప్పులూ, యెటెళ్లారో యేమో నేనించోలేను." శర్మ స్తంభం కావిలించుకున్నాడు.

కిళ్లీ దుకాణంలోంచి, బొట్టికాయొకడు, పరుగెత్తుకుచ్చాడు జారిపోతున్న చెడ్డీపైకి లాక్కుంటూ, యెగబీలుస్తూ, తాళంచెవీ తాడూ గాలిలో వూగిస్తూ అన్నాడు.

"ఇదో బీగం, మీకిమ్మన్నారు సార్!"

"బతికించావు నాయనా! చాలా థాంక్స్!"

తాళందీసి గదిలో కడుగించారిద్దరూ. అక్కడి భీభత్స దృశ్యం చూసి, గోడకానుకున్నారు. శర్మ, యేం జరిగిందీ, యెంతమంది యీ గదిలో పోగయిందీ యోగదృష్టితో తెలుసుకోవాల పైకి చూశాడు.

యెంగిలి విస్తరాకులూ, మూలగా విడిచేసిన గుడ్డలూ, నలిగిన పక్కా అది కాంప్‌కాట్ యెత్తుతక్కువ, దొర్వైనకు చిక్కజుత్తూ, అద్దంమీద కాటుక తిలకం మరకలూ, అంటగిన్నెలు వోపక్కా, స్టౌ పక్కగా కిరొసిన్ ఒలికిన మరకా, నేలమీద పత్రికలూ కనిపించినై. హేరాయిల్ సీసామీద మూతలేదు, రెండు నేత తువాలాలు తడివి శవాలల్లే తాడుమీద వేలాడుతున్నాయి.

శర్మ నవ్వి కొండయ్య్ తల దువ్వాడు.

"నీ పెట్టెలో రొఖ్ఖమున్నదో లేదో చూసుకో."

కొండయ్య బైటకొచ్చాడు, కారేజ్‌తెచ్చిచ్చే పిల్లతొక్కుడుబిళ్ళ ఆడుతున్నది, పిలుచుకొచ్చాడు. గది శుభ్రం చేయించాడు, పక్కమార్చి, నడుం వాల్చాడు.

'వంటకు సామానెక్కడిదో శర్మా!'

శర్మ అతని పక్కనే వాలాడు.

"యేమో నన్నడక్కు, అత్తయ్యనే అడుగు."

కొండయ్య లేచి కింద చాపమీద కూచున్నాడు. పాతవి ప్రశ్నాపత్రాలు చదువుతూ జవాబులు పైకి చెపుతున్నాడు. బయట కలకలం.

"తలుపు తియ్యండి." అని బాదుతున్నాడు.

కొండయ్య తలుపు తీయటమేమిటి, సాంబు అతనిమీద పడటమేమిటి క్షణంలో జరిగినై. కొండయ్య సాంబూని లేవదీశాడు.

"భలేవారే! తలుపు తీస్తున్నానని చెప్పద్దూ? యెంత సేపటికీ తియ్యకపోతే లోపలెవరూ లేరనుకుని తలుపు నానుకున్నాను. పడను మరీ?" తలలోని కనకాంబరాలు దిద్దుకుని శర్మవున్న మంచంమీద అతన్ని అనుకుని కూచున్నది.

"యెంతసేపైందీ మీరిద్దరూ వచ్చీ? కిల్లీకొట్లో తాళం యిచ్చి వెళ్ళామే, ఇవ్వలేదూ?"

కొండయ్య నిలబడి ఆ పిల్లనే చూస్తున్నాడు.

'అట్లా చూస్తారేం నావంక?'

"ఫూల్‌లాగా మాట్లాడకు, తాళం యివ్వనిదీ గదిలోకెట్లా తగలడ్డామంటావ్? మీదనించి లే ముందు." శర్మ సాంబూని నెట్టేస్తూ అన్నాడు.

"నీకెప్పుడూ కోపమే, యెవతెవస్తుందోగాని, నీతో నీ పెళ్ళాం వేగలేదబ్బా!" కూచునే అన్నది.

"అర్థమైన వాళ్ళతో సినిమాకెడ్చేది, యేదో నీవంటిది రాకపోదులే, యెదురుగా మరో మగవాడున్నాడా, నీకు లేకపోతే నేం సిగ్గూ, నాకున్నది లే. ఆ చాప మీదేడు." శర్మ నెట్టాడు.

"కూచోనీవోయ్! ఫరవాలేదు, నేనెవరితో అననులే, వంట కు సామానెక్కడిదమ్మా?" కొండయ్య కూచుంటూ అడిగాడు.

శర్మ నెట్టుతుంటే సాంబు లేచి చా ప మీ ద కూచున్నది. పమిట మాయకుండా పైకితీసి కూచున్నది.

'వంటజేశామనా బావ కోప్పం? అందరికీ వంట జెయ్య కమ్మా అంటే మా అమ్మ వింటేనా? మీరు పొద్దున్నే వెళ్ళి పోయారు. మా ఫ్రండ్సు వచ్చారు. నిన్నా మొన్నా పేపర్లు బాగా ఆన్సర్ చేశారట. ఇవాళ హాలిడే, సినిమాకెళ్దామన్నారు. రిలేటివ్సు యిద్దరొచ్చారు, అందరూ తలోటీ తెచ్చారు, మీ కారే జ్ కనిపించింది.' అని ఆగింది.

'వాటికి చిల్లులున్నాయే?' కొండయ్య అడిగాడు.

"ఫరవాలేదు, మా అమ్మ, తడిపిన శనగపిండి అ టించి వండేయగలదు. దగ్గర్లోనే పూ ర గా య లు కనిపించాయట. నిముషంలో కొనుక్కొచ్చింది. సెయ్యొచల్లా ముప్పైత్తి తెచ్చే సింది" సాంబూ నవ్వింది.

"తను మా నాయనమ్మ తోటికోడలు కూతుర్ని చూసి వస్తానని వెళ్ళిపోయింది. మేటనీకి టైమైంది. గిన్నెలు తోమే

టైం లేదు" అప్పుడు గదంతా చూసింది సాంబూ. పాపం మీరు గిన్నెలు తోముకుని గది కడుక్కున్నట్టున్నారు. చేయి గడ్డంకింద పెట్టుకుని విచారంగా చూసింది.

శర్మ ముసుగు పెట్టాడు. 'తక్కిన శాల్తీ లేవీ?'

"చెప్పానుగా, అన్నయ్యేనా? వస్తాడు, అమ్మ ఆ.కా.మా. పై చేస్తున్నదిగా, సముద్రస్నానం చేసింది, వెంకటేశ్వరుని దర్శించి వస్తుంది.

"ఆ,కా.మా,పై,లో ఫాల్గునంలేదే పిచ్చిమొద్దా?"

సినిమాకి డబ్బు లెక్కడివీ, దేనికెళ్లావూ? కుర్చీకా? తిట్టనిదీ మాట్టాడలేవు. ఫ్రండొచ్చారన్నానా, బాల్కనీకి టికెట్టు వాళ్ళే కొనితెచ్చారు. అన్నది గర్వంగా. 'అబ్బో! తెల్లవారు మనదేశం వదిలి వెళ్ళిపోయిన యిన్నేళ్ళకి నీకు యింగ్లీషొచ్చిందే. యేదీ కొంచెం 'హాఫియర్లీ' అను. మన కొండయ్య వింటాడు.' సాంబు నాలిక్కొరుకుని తమాషాగా నవ్వింది.

'హాఫియల్‌రీ' అనేసి మొహాన చేతులుంచుకున్నది.

కొండయ్యకూ నవ్వు వచ్చింది, శీను వచ్చాడు, చేతులో వేపమండలున్నాయి.

"అవిఎందుకోయ్! తేలుమంత్రం వేస్తావా?" కొండయ్య అడిగాడు, శీనుతల అడ్డంగా తిప్పాడు.

ఊహుం, రేపు వుగాది, పొద్దున్నే అభ్యంగనం చేసి, వేపపూవు పచ్చడి తిన్నాలి, ఉగాది పచ్చడీ, పంచాగ శ్రవణం, గోచార ఫలం తినాలి, గుడికెళ్ళాలి.

'తలంటు చూడానా? యెక్కడ చేస్తారేవిటీ? కుంకుళ్లూ నూనే, కాగూ వొయ్యా!' ఆశ్చర్యంగా చూశాడు కొండయ్య.

'ఇక్కడే, మా అమ్మ అన్నీ సిద్ధం చేసేస్తుంది, కావాలంటే నీ చేతగూడా వేయిస్తుంది.' శీను తాపీగా చెప్పి, దినపత్రిక మీద వేపపూవు తుంపిపోస్తూ కూచున్నాడు.

హాస్యాలాడు తున్నాడనుకున్నాడు కొండయ్య.

కాని మరునాడు పొద్దుపొడుస్తుండ~నే జానికమ్మత్తయ్య ఓ అయిదు రూపాయలియ్య నా య నా, తీర్చేస్తానూ, అని పూదరపెట్టి కొండయ్య జేబులోంచి నోటు పూడిపడేట్టు చేసింది.

బావీ, బావిపక్కనే బాత్, రేకు తలుపు ఒకటీ శర్మకూ, కొండయ్యకూ స్నానంచేసే ఛాన్సు రాలేదు, కొంతమంది బావికి అటుగా స్నానాలు కానిస్తున్నారు, నీళ్ళగదిలో పాంబు తలంటు పూర్తి అవుతుండగానే, వాకిలివద్ద శీను నూనెమర్దిస్తూ నించున్నాడు. ఇంకా క్యూలో స్త్రీలు గుడ్డలు బుజానేసుకుని నిలబడి వున్నారు, ఇవతల మూడు రాళ్ళమీదడేకిసాలో నీళ్లుకాగుతున్నై, బకెట్లున్నాయి.

సాయంకాలం దగ్గర్లోనే వున్న గుడికి వెళ్ళారు,

అంతటితో యజ్ఞం పూర్తయిందని, కొండయ్య అపోహ పడ్డాడు. శర్మ పక్కచూపులు చూశాడు, పిల్లలు పరీక్షలు వ్రాసి వస్తున్నారు. శ్రీరామనవమి రానేవచ్చింది. కొండయ్య యిరవై రూపాయలనోటూ జేబులోంచి నడిచివెళ్ళింది. జానిక

మ్మత్త మూటలోంచి సీతారాముల పఠంతీసింది. శీను పూజా సామాగ్రి అమర్చాడు, అరటిపిలకలు తెచ్చి మందిరం కట్టాడు. దీపారాధనా, పూదొత్తులవాసనా, మంత్రాలూ, తలంత్రాలూ, గంట వాయించటం, ఆనందనీరాజనం వెలిగించి అత్తయ్య దేవుడికి అద్దాక కొండయ్యకీ తక్కినవారికీ చూపింది. దక్షిణవేసి కళ్ళకద్దుకున్నారు. మంత్రపుష్పం యోమాం పుష్పం, సీతారామార్పణ మస్తు. ప్రసాదంశిరసా గృహ్ణామి అని అందరినెత్తినా అక్షింతలు వేసింది. పానకం వడపప్పు పంచింది.

"అంతా ముందే పథకంవేసుకునే వచ్చినట్టున్నారు." అనుకున్నాడు కొండయ్య.

పరీక్షలు సజావుగా అయినై, జానికమ్మత్తయ్య మకాం యెత్తేస్తూ, దేశవాళీ బెడ్డింగు శీను తల మీదకెత్తింది. కొండయ్య మూటలందున్నాడు.

'మాట స్వచ్ఛంగా వుండి, కూడా తిరురుతూ సాయం చేస్తే, మనవాళ్ళే అనుకున్నాను. మా సాంబుని నీకిద్దామని గూడా ఆలోచన వచ్చింది.' అత్తయ్యా పిల్లలూ కొత్తఆటో రిక్షాలో వెళ్లారు.

నీరసపడి కొండయ్యా చాపమీద పడుకున్నాడు.

'బలవర్ధకమైన చ్యవనప్రాశ నాకవోయ్!'

"ఇల్లలకగానే పండగయి పోయిందీ? ఆవిడ నిన్నట్లా తేలిగ్గా వదిలేస్తుందీ? చూద్దాం."

## 4

ఏప్రిల్ గడిచింది, కొండయ్య పరీక్ష వాయిదా పడింది. యేదో ఇన్‌ఫెక్షన్ వల్ల విద్యార్థులకు కళ్ళజబ్బు వచ్చిందట, యూనివర్శిటీ వారు నెల గడువిచ్చారు.

కొండయ్య యింకా ప్రిపేరౌతూనే వున్నాడు. యెండలు భగ్గుమంటున్నాయి. కర్చిఫ్‌తో మొహం తుడుచుకుంటూ వాకి ట్లోకొస్తే ఫోస్ట్‌మాన్ వుత్తరమిచ్చాడు. గదిలోకొచ్చి ఆలోచిస్తూ కూచున్నాడు.

శర్మకిల్లీ నవులుతూ వచ్చాడు, "యేవుటోయ్! ఆలో చనా?" అన్నాడు కూచుంటూ.

"వుత్తరం చదవాలా వద్దా? యెవరు వ్రాశారు?"

'ఇదవై రూపాయలు పందెం కాస్తావా? అది అత్తయ్య వ్రాయించింది, నీకు. ఉత్తరంలో యేముందో చెపుతా.'

చెప్పలేకపోతే నువ్వు అచ్చుకుంటావా?

శర్మ యెర్రని పెదవులమధ్యగా తెల్లనిపళ్ళు కనబడేట్టు నవ్వాడు, లుంగీ సర్దుకున్నాడు.

'మనకాభయం లేదు, కాస్తావా?'

కొండయ్య ఇన్‌లాండ్ కవర్ వూడదీసి, వ్రాత తనవేపు వుండేట్టు పట్టుకున్నాడు, శర్మ చెప్పారు పోయాడు.

"చిరంజీవి కొండయ్యకు,

ఆయుష్మంతునిగా దీవించి, జానికమ్మత్తయ్య వ్రాయించు శుభలేఖార్థములు,

ఉభకుశలోపరి, మా శీను, లెక్కలూ, యింగ్లీషూ బొగా రాయలేదుట, సాంబుతల్లి హిందీ పేపరంతా తగలేసిందిట, ఊహూ యేడుస్తున్నది.

ఈయేడు చాలామంది, మెట్రిక్ ఫెయిలయినారనీ, అందువల్ల యూనివర్శిటీ వారే స్వయంగా కొన్ని మార్కులు కలుపుతారనీ తెలిసింది. కనుక నువ్వు వో కన్ను అటుంచి, పిల్లలిద్దరి నంబర్లూ పేపర్లో పడేట్టు చూడు. పరాయివాడవయినా, మేమున్నప్పుడెంతో కలుపుగోలుతనంగా వుండటమే గాక, చూస్తామనంగానే, సింహాచలమూ, శ్రీకూర్మమూ, అన్నవరమూ చూపించి తెచ్చావు.

మేనల్లుడన్న మాటేగాని, మా శర్మ పెదసరం మాకు తెలియనిది గాదు. వాడికి మామీద యేమాత్రం అపేక్ష వున్నా, మేము నీకివ్వాల్సింది తీర్చేస్తాడు.

ఆశీర్వచనం తప్ప, ప్రస్తుతం నేను నీకేమీ యివ్వలేని స్థితిలో వున్నాను.

పిల్లల విషయంలో యేమైనా ఖర్చుచేయాల్సి వుంటే మా శర్మనడిగి తీసుకో. లేకపోతే నువేసద్దు, వీలుచూసుకుని పంట అమ్మగానే పంపుతాను.

సమర్థుడివని నీకివన్నీ వ్రాయించాను.

జానికమ్మత్త."

శర్మ నోరు యీ చివరినుంచి ఆ చివరికి వ్యాపిస్తుంటే, కొండయ్య నోరు వెళ్ళబెట్టాడు.

"నీకు దివ్యచక్షువులో, యోగ దృష్టో వున్నది. నాకే వ్రాయించిందని యెట్లా తెలిసిందీ?" అన్నాడు.

'అపర కానన్‌డైల్! నాడబ్బు నాముఖాన పడేయ్ ముందు, నీ పేరున్న వేపు నావేపు పెట్టి పట్టుకున్నావు.'

శర్మ చప్పట్లు కొడుతూ నవ్వాడు.

"నేనొప్పుకోను, ఉత్తరంగూడా వెనుకనించి చదివావు." కవర్ మడిచేశాడు.

"మళ్ళా పందెం, ఆకవరటుతే నేపట్టుకుంటా నువ్వటు నించి చదవాలి." శర్మ నవ్వుతూనే వున్నాడు.

## 5

కొత్తగా జిల్లాస్థాయికి పెరిగి, పత్రికాశంజిల్లా అనిపించుకుంటున్నది ఒంగోలు. ఆ వూరులో జానికమ్మకు స యా నా మేనగోడలున్నది. పెద్దన్న కూతురు పేరు శారద. ఆమె భర్త దండయ్య, బి డి వో గా వుద్యోగం చేస్తున్నాడు.

ఇంట్లో అడుగు పెడుతూనే, జానికమ్మ సంచి కిందవుంచి మంచంమీద కూచుని, శారద కాళ్ళమీద చేయివేసి రాచింది.

"అమ్మాయ్! నాకో త్తరంముక్క రాయించి పడేస్తే, రెక్కలుగట్టుకు వాలకపోయానూ. నెలలు నిండినట్టున్న యే?" అన్నది.

శారదకు మేనత్త గొంతు వినబడంగానే గుండెల్లో రాయిబ డింది. లేవలేక పోయింది.

'మీ అత్తగారు రాలేదా? యెట్లాగైనా, డబ్బుగల వాళ్ళకి అపేక్షలు తక్కువే శారదా, మీ అత్తగారికి ఆవిడ తండ్రి తన భీమా డబ్బు యాభై వేలూ ఆవిడికి చెందేట్టు వ్రాసి పోయినా డని చెప్పుకుంటున్నారు. నిజమేనా?' అనడిగింది.

చదివే తెలుగు వారపత్రిక కిందబడేసింది శారద. భయం మొహంమీద కనబడనీయక, గరళకంఠుడల్లే చూస్తూ, తెల్లని మొహంమీదికి నవ్వు తెచ్చుకున్నది.

'నాకు తెలియదత్తయ్యా, మా అత్తగార్ని నేనడగలేదు.' లేచి కూచున్నది. ఇప్పుడేనా రావటం? స్నానం చేద్దువుగాని లే, అన్నది.

'ఓసి నీ మర్యాద బంగారంగానూ! మేనత్త నేగదుటే, బల్లిలా మంచానికంటుకుపోతే, నీ మొగుడెట్లా చూస్తూ వూరు కున్నాడూ?'

జానిపమ్మత్త దొడ్లోకి పోయింది. పొయ్యిమీద కాగు చూసింది, వేడినీళ్ళవునా కాదా అని కాగులో చెయి ముంచి చూస్తూ కేకవేసింది.

'శారదా! నాదగ్గర చిల్లరలేదు, నోటుమార్చి యిస్తా బండి వాడికి డబ్బులియ్యి.'

శారద దేవుడి పీటకిందనించి చిల్లరతీసి బండివాడి కిచ్చింది. సాంబూ శీనూ ఆయాసపడుతూ సంచీలూ బెడ్డింగూ లాక్కొచ్చారు.

శారద పట్టుచీర కట్టింది. విస్తట్లో పేడన్నం వడ్డించింది. పిల్లలిద్దరికీ స్టెయిన్‌లెస్ స్టీలుపళ్లాలు పెట్టింది, నిమ్మకాయ వూరగాయా, అప్పడం, వడియం, వేపుడుముక్కలూ, కందిపొడీ, కొబ్బరికారం, చారూ మజ్జిగా దగ్గరగా పెట్టింది. నెయ్యి పట్టుకు నించున్నది.

'ఇన్నెందుకే అమ్మాయ్! వోపలేని దానవు విశ్రాంతిగా పడుకోక వని అందుకున్నావూ?' అంటూనే నేయి వేయించుకుంటూ సుష్ఠుగా తిన్నది.

పిల్లలిద్దరూ అన్నంతినటం కాగానే, కారమ్ బోర్డుచూశారు నేలమీద వుంచి ఆడసాగారు.

శారద మంచంమీద వాలింది, కూతురు సుశీల జూనియర్ కాలేజీనించి వచ్చింది, లోపలి కడుగుంచగానే కారమ్స్ ఆడుతున్న చుట్టాలు కంటబడ్డారు, చిట చిటలాడుతూ గదిలోకి పోయింది. పుస్తకాలు షెల్ఫులోకి విసిరేసింది. కాళ్లూ చేతులూ కడుక్కొచ్చి అన్నం పెట్టుకుతిన్నది. పళ్ళెం దొడ్లోకి గిరవాటేసింది, పుస్తకాలబొత్తి అందుకుంటూనే పరుగెత్తింది.

నేలమీద కొంగు పరుచుకున్న జానికమ్మ కళ్ళార్పుతూ తెరుస్తూ యిదంతా చూస్తునేవున్నది. తననుగానీ పిల్లలనుగానీ పలకరించలేదని,

'నీకూతురుకి బొత్తిగా భయం భక్తిలేవే శారదా! నన్నడిగితే అన్నం పెట్టనూ?' అన్నది.

'నేను పడకవేసినప్పుడు పనంతా అదేచేస్తుందత్తయ్యా! వాళ్ళనాన్న ముద్దుచేస్తారు. అందుకని మధ్య మధ్య అలా చేస్తుంది.'

రాత్రికట్టహాసంగా వంట జేసింది. కొడుకు వరసై దండయ్యకి భోజనం పెట్టింది. పక్కన కూచుని చల్లగా వచ్చిన పని చెప్పింది.

"మీ యిలాకాలో యేదో పోస్టు ఖాళీఅయిందిట, శీను ధరఖాస్తు పడేశాడు. ఆ వుద్యోగం వచ్చేట్టుచూస్తే, శారదకు సాయంగా దానిదగ్గరే వుంటా, ఇది నగరమంటున్నారు గానీ పల్లెలాగా వున్నది, నీళ్ళు చేదూ, కారం, పెద్దవాళ్లు దగ్గరుంటే మంచిది."

దండయ్య వులకలేదు పలకలేదు, అతనికి చెవుడేమైనా వచ్చిందా అని జానికమ్మ అనుమానమేసి, పెద్దగా అన్నది.

'నేనందుకే, అమ్మాయ్! నీకార్నెల్లు చూలింత వేషంతోనూ, ఆర్నెల్లు బాలింత వేషంతోనూ సరిపోతుందె. పెద్దదాన్ని కావేశ్రీ నీదగ్గరుండనీయవే, చేతికింద ఆసరాగా వుంటుందని దింపిపోతిని.'

దండయ్య, దింపిపోతే కావేఁశ్రీ యెవడితోనో లేచి పోబోతే, నేనే పట్టుకుని, పనిపేళా రైలు ఖర్చులు పెట్టుకుని వచ్చి,

మీ అమ్మాయిని, మీకప్పగించాను పిన్నీ! అన్నాడు. పెద్ద అవ్వడం ఫెళఫెళా విరిచి కలుపుకుంటూ ఓరగాచూస్తూ నవ్వుతున్నాడు.

డిప్పకళ్ళూ, చుట్టపెదిమలూ, దండయ్య, విస్తట్లో వన్నీ బోతరాజు లాగా తినేస్తూ యెంతమాట బైటికన్నాడూ అని జానికమ్మకు కోపమొచ్చింది.

"శారదా! నీ మొగుడికేంగావాలో చూసుకోమ్మా! దొడ్లో తాడుమీద, పట్టుబట్ట ఆరేసివచ్చాను, యెత్తుకుపోయినారేమో." లేచి పోయింది,

తను వచ్చిన నాలుగోనాడే, శారద కొడుకును గని, అత్తయ్యతో యెం_నా అవసరమున్నది. శీనుకి వుద్యోగమిప్పించండి. అని మొగుడిమీదికి వత్తిడి తేకపోగా. వారం గడిచినా, 'సెప్పి' అని గూడా అనలేదు.

తల: టిపోస్తా రమ్మన్నది, ముందు తన పిల్లలకి ఆదరాబాదరా కానిచ్చింది, శారద పిల్లల్ని పిలిస్తే అందకుండా పారిపోయారు.

శారదను యెత్తుపీటమీద కూచో పెట్టింది. ఆముదంబొట్టు గర్భంమీద వేసి చూసింది.

'జర్రున జారుతున్నదే, ఇంకా యెందుకాలస్యమవుతున్నదబ్బా!' అన్నది. ఆ గుర్తు యేమిటో శారదకు అర్థంగాలేదు.

రెండుపూటలా వంటజేసినా కొండయ్య కిమన్నాస్తి. ఉద్యోగం వేయించలేదు, యేమైందో చెప్పదు, అత్తయ్యకు గుబులు బుట్టింది.

"ఇక్కడే దగ్గర్లోనే మా చిన్నమ్మ వున్నదీ, మీ నాన్నా నేనూ ఆవిడదగ్గరే పెరిగాం, యెద్దుబండిమీద వెళ్ళి రావచ్చుపట యెంతో గాదు. ఇంతదూరమొచ్చీ, మంచాన బడివున్న పెద్ద ముండను చూసిరాకపోతే యేడుస్తుంది." అని రొద పెట్టింది. అత్తయ్య, ఆవిడకొక్కవాల్సింది అందింది.

పదిరోజులైనారాలేదు, శారద సుఖంగా కొడుకునుగన్నది. సుశీల, తల్లికి పచ్చుం వండింది, అవసరానికి కావాల్సినవన్నీ అందించింది. తండ్రిని ఆఫీసుకూ, తమ్ముళ్ళను బడికి పంపించింది.

పదిహేనోనాడు జానికమ్మత్త సంతానంతో దిగింది.

'అయ్యో! పుణ్యావాచనంలేదు, బారసాలలేదు, పండంటి కొడుకునుగని, యింట్లో తిరుగుతున్నావా!' అని రంకెలేసింది. యెవరికీ యేమీ తోచనీయలేదు.

చిన్నమ్మని చూడటానికికెళితే, అక్కడ పిల్లలిద్దరికీ తడపర అంటుకున్నదిట, స్నానం కానిచ్చి వచ్చేసిందిట, పిల్లలిద్దరూ దగ్గుతున్నారు.

దాంతో శారద పిల్లలకి ఒక్కొక్కరికే తడపర పోసింది. పసికూనకి జ్వరం తాకి యేడిచాడు.

దండయ్యకు యిల్లు నరకమై, కంపరంబుట్టింది, వుద్యోగ మిప్పిస్తే పోతారేమోనని దెందుకూరు వేయించాడు, పదిమైళ్ళ దూరం.

జానికమ్మ పొంగిపోయింది, పెద్దవంట వక్కతేచేసి పౌర సాల అయిందనిపించి, తనకూ పిల్లలకూ బట్టలు పెట్టించుకున్నది.

దండయ్య ఆఫీస్‌కెళ్లాడు, శారదపసివాడికి పాలిస్తున్నది.

"నేవేళ్ళేప్పటికి శర్మ మంచంలో వున్నాడు, వంటకని యెవత్తెనో వుంచుకున్నాడు, అదెటోవుడాయించింది. నెలకి ఖమ్మగా మూడువేలు స్కాలర్‌షిప్ వస్తున్నదా, మేనత్తకూతు రని సాంబు మొహాన జాకెట్టుగుడ్డన్నా పెట్టలేదు, నాకెవరిమీదా పోదుగా, రెండో అన్నకొడుకని అక్కడేవుండి చేసి పెట్టాను, నా చేతివంట తిని నవనవలాడుతూ తేలాడు." అన్నది అత్తయ్య

"తిరుపతివెళ్ళి, గుండు కొట్టించుకుంటానని మొక్కుకున్నా కే వుద్యోగం వచ్చింది. పోవాలి, లే" శీను తొందరపెట్టాడు.

దండయ్య వస్తూనే ప్రయాణం చేయించాడు.

అత్తయ్య, ముక్కి, మూలిగి, తిట్టుకుని, తల విసిరి, చెయ్యి కింద ఆనించిలేచింది.

"యెక్కడా నాల్రోజులు సుఖంగా వుండనివ్వ రే శారదా! చూస్తున్నావుగా, ఇదీ వరస"

మరునాడు సాయంకాలం ఆదివారమని పిల్లలు అన్నాలు తిని సినిమాకెళ్ళారు, పిల్లవాడిని వుయ్యాల్లో వుంచింది శారదా. తలదువ్వుకుని కాటుక పెట్టుకున్నది, ఆరింటికి అన్నందిన్నది. తాంబూలం నవులుతున్నది, దండయ్య పక్కనకూచుని కబుర్లు చెపుతున్నాడు.

'మొత్తానికి అత్తయ్య వుద్యోగం దక్కించుకున్నది మీచేత ఖర్చు చేయించింది, ఆవిడ రాగానే చాలా భయపడ్డా నండీ' అన్నది.

'అదా, టెంపొరరీ జాబ్, అనవసరమని తోచంగానే తీసేస్తారు.' తలమీద రాస్తూ నవ్వాడు.

## 6

కాలం పరుగెత్తింది, శర్మ థీసిస్ పూర్తికాలేదు, ప్రొఫెసరేదో వంక పెడుతున్నాడు, మధ్యలో పెళ్ళిచేసుకో అంటూ వున్నాడు. శర్మకు కోపం వస్తుంది.

హోటల్కెళ్దామని వాకిట్లోకొస్తే పోస్టువాడు వుత్తరాలకట్ట అందించాడు.

"ఇన్నెక్కడినించో?" ఆకలి మరిచి, గదిలోకొచ్చి కాంప్ కాట్ మీద కూచుని ఒక్కొక్కటే చూస్తున్నాడు, విదేశీ యూనివ

ర్శిటీ నించి, సీనియర్ ఫెలోషిప్‌కి దరఖాస్తుఫారాలు రెండు. నర్సాపూర్లో జూనియర్ కాలేజీలో లెక్చరర్‌పని యిస్తారుట, ఇంటర్వ్యూకి రావాలి, కలకత్తాలో బేవాన్ కంపెనీవారు మెకా నిక్‌గా యిష్టమైతే రావచ్చని వ్రాశారు. అయిదో వుత్తరం విప్పాడు, అక్క శారదా వ్రాసింది. ముత్యాలకోవ అక్షరాలతో రసవత్తరంగా వ్రాసింది. "మామయ్య నవనవలాడుతున్నా డుట, రమ్మని రాయలేదు అమ్మా, చూద్దాము" అని సుశీల వ్రాయమన్నది" అని అత్తయ్య ఆగమనం, నిర్గమనమంతా వ్రాసింది.

"దీన్ని షార్ట్‌స్టోరీగా డిద్ది, దీపావళి పోటీకి పంపచ్చు." అని నవ్వుకున్నాడు. ఆరు మరోచెల్లెలు పద్మ వ్రాసింది, పద్మ వైజాగ్‌లో కాన్వెంటులో బియస్సీ చదువుతూ వుండేది, అప్పుడు శర్మ యెమ్మెస్సీ 'అన్నయ్యా' అంటూ వస్తువుండేది. పెళ్ళి చేశారు, రామం శర్మ ఫ్రెండే, కట్నం తీసుకోలేదు. పద్మను చూసి కావాలనే చేసుకున్నాడు, దీనికి డిగ్రీ వచ్చింది, అతనికి జాబ్ వచ్చింది, తీసికెళ్లాడు.

"మా ఆయన నీకు గుర్తేగా అన్నయ్యా, మంచి పేరే తెచ్చుకున్నారు. ప్రాణమన్నా యిస్తారుగాని పైసావదలరు. ధరలు హెచ్చినకొద్దీ పొదుపు వుద్యమం యెక్కువైంది. యెం దుకనో నామీద దయపుట్టి, యింటి ఖర్చులకని డబ్బుయివ్వసా గారు. బంగారుగాజులెలాగూ చేయించుకోలేనన, అందులోనే

మిగుల్చుకుని గిల్టు గాజులూ, పుస్తెలగొలుసూ కొనుకున్నాను. నైలెక్సు చీరకొని పెట్టారు, డెట్‌ముక్కతో దాన్ని వుతుక్కుని వాడుకుంటున్నాను. పూలు తలలో తురుముకుని మురుస్తుండగా పానకంలో పుడక బడింది, అత్తయ్య వస్తున్నట్టు ముందుగా కలన్నా వచ్చిందిగాదు, జాగర్త పడేదాన్ని. యేం జరిగిందీ వూహించి, యీ దాయాది చెల్లెలుమీద జాలిపడు.

ఇప్పుడు రామంగారూ నేనూ అలుమగలం కాదు, అత్తయ్య వచ్చి వెళ్లాక నాన్న వుత్తరం వ్రాయటం మానేశాడు. రామంగారు నన్ను వుద్యోగం చేయనీయరు. విడాకులూ యివ్వరు.

అత్తయ్య రైలుచార్జీలు రామంగారివ్వకపోవటం వల్ల యెన్నడూ లేనిది, అప్పులుతెచ్చి నేనే యివ్వాల్సివచ్చింది.

"సాంబుకి సంబంధమున్నదని నీ మొగుడు వ్రాయిస్తే వచ్చాను. యిక్కడే చేస్తాను, మీరిద్దరూ పీటలమీద కూచుందుగాని" అని నవ్విందత్తయ్య

సరీగ్గా ఆవకాయ పెట్టే సీజన్‌లో వచ్చింది. నాకు సరిగా రాదనీ, చిన్న పిల్లననీ, తక్కువ ఖర్చుతో పెడతాననీ, జాడీడు ఆవకాయ పెట్టింది. రామంగారు లెక్కచూసి మూడొందలైందని మూర్ఛపోయారు. అత్తయ్య సగం ఆవకాయ పాత అల్యూమినియం-కారేజీలో సర్ది, తీసికెళ్ళింది.

'పద్మకి పొదుపుతెలియదు, మనిషన్నం పనిదానికి వేస్తున్నది. ఇద్దరూ కాఫీచేసుకు తాగుతూ వుంటారు. నువ్వు పొద్దునగా వెళ్ళి దీపాలు పెట్టాకగానీ రాలై పాయె. నీ చెల్లిల్ని తెచ్చి దగ్గరుంచుకో' అని అమూల్యమైన సలహాయిచ్చి వెళ్ళిందత్తయ్య. మెట్రిసవ్వులూ నేను లేచిపోవాల్సిందే, నాజేబులో చిల్లరతీశావా? అంటారు. సినిమాకు డబ్బెక్కడీ? అని నిగ్గదీస్తారు. మన పొరుగు సీతాదేవి రమ్మంటే వెళ్ళాను. ఆమె పెట్టుకున్నది. అంటీనమ్మరు, పనిమనిషి మొత్తుతుని, పూరికేనే చేస్తానని వెక్కిరించి వెళ్ళింది. పురిచెట్టుకోనా? అని ఆలోచిస్తున్నాను' అని ముగించింది పద్మ.

శర్మ జూన్ యెండలకి తాళలేక వుస్సురని నిట్టూర్చాడు. 'కట్నంవద్దన్న రామం కాల్చుకుతిందామను కున్నట్టున్నాడు' అనుకున్నాడు.

మరో వుత్తరమున్నది, చదవబుద్ధిగాలేదు. భోజనానికి వెళ్ళబుద్ధిగా లేదు, దూరంగా చూస్తే యెవరో వస్తున్నారు. జానికమ్మత్తయ్యేమోనని గుండె గుబగుబలాడింది. చచ్చుబడి లేవలేక పోయినాడు శర్మ.

పద్మని సింహాచలంలో సంఘసేవిక, ఆ జాబ్ గూడా శర్మ రికమెండేషన్ మీదే వచ్చింది. ఈమధ్యే మెట్రిక్‌పాసైంది. వాయిల్‌చీరా, రవికా, రింగులూ, హాండ్‌బాగూ, ముంజేతిని వాచీ.

"నమస్కారం" అన్నది నిలబడి.

థీసిస్ కాగితాలుదిద్దుతూ తలవంచి వున్న శర్మ తలెత్తాడు హమ్మయ్య! అత్తయ్య కాదనుకున్నాడు.

"యేం యిలా వేంచేశారు? సింహాచలంలో సంఘసేవ ముగిసిందా? పొదుపు వుద్యమం ఫలించలేదా? ఫామిలీప్లానింగ్ నిరసించారా? పిల్లల్ని బడికి పంపక కూలికి పంపారా? మొక్కలు నాటమన్నారా?" కూచుంటూ అన్నది. పోదురూ, వెక్కిరింతకు వేళాపాలా లేదు. వుద్యోగం పోయి నేనేడుస్తుంటే.

'మరి దేనికి వచ్చినట్టూ? పెళ్లాడుతారా? అని అడగటానికా, అదీ సోషల్ వర్కే.'

పద్మిని నవ్వింది. 'మీ డిపార్టుమెంటులో అటెండరో స్టోర్‌కీపరో రిటైరైనారుట, నన్నా వుద్యోగంలోకి జరుపుదురూ మీకు పుణ్యముంటుంది.'

'యెందుకూ? యిక్కడ స్టూడెంట్సుకి సేవ జేసారా? మా డిపార్ట్‌మెంటులో పైరాబడేం వుండదండీ. యేడాక్టరెక్కడందుతాడో చెప్పి ఓ పరకా, యే స్కూల్లో సీటు దొరుకుతుందో చూపి వో యాభై, వుమెన్ వేల్‌ఫేర్ సెంటర్లొ మిడ్‌వైఫ్ పని ఖాళీగా వుందని తెలియజేసినందుకు వో వందా రెడ్‌క్రాస్ సెంటర్లో క్లీనర్‌పని యెవరిస్తారో మరికొంచెం, డియివో బంగ్లాకి

తీసికెళ్ళి టీచర్లు వుద్యోగం ఖాయం చేయించినందుకు యింకొం చెం గుంజటానికిక్కడ అవకాశం లేదు. మీరు సంఘసేవికగానే రాణించారు' కన్నార్పకుండా చూస్తున్న పద్మిని నవ్వింది.

"అయిందా తిట్టటం?"

'అర్హతలేమిండీ, మెట్రిక్ ఒడ్డుపట్టిందా? చెట్టెక్కిందా? పట్టభద్రులనించే అప్లికేషన్లు వస్తున్నాయట.'

'మీదయవల్ల ఒడ్డుపట్టిందండీ, పాసుకావాలని ట్యూషన్ గూడా పెట్టుకుని మరీ పాసైనాను, మీరు శ్రమ తీసుకోటమే తరవాయి.' బాగ్‌లోంచి కాగితాలు తీసింది. అప్లికేషనిదిగో, ఇచ్చుకో లేదు, అదీ యిబ్బంది.

'పుచ్చుకో గలరు' అన్నాడు కటువుగా.

పద్మిని వినినట్టు, ఆపని యిప్పిస్తే, మీ రూమ్ క్లీన్‌చేసి పెడతాను. లంచ్ తయారుచేస్తాను. దుస్తులు యిస్త్రీ చేస్తాను. ఫెయిర్‌తీసి పెడతాను, అంటున్నది.

"మీరు మా అత్తయ్య కోవలోకివస్తారు. పనిచేసి పెడతా నంటూవస్తుంది. తనపని నెరవేర్చుకుంటుంది."

'మీ అత్తయ్య యేం చదువు కున్నారు, యేం వుద్యోగం చేస్తున్నారు? యెంత సర్వీసున్నది?"

ఇంతసేపటికి శర్మకి నవ్వు వచ్చింది.

"బోలెడంత ప్రపంచజ్ఞానం, యింగితజ్ఞానం పరేంగిత జ్ఞానం వున్నాయి, అవే డిగ్రీలు, ఆ సంఘసేవకు రిటైర్ కావటమనేది వుండదు. అవకాశవాది. సంఘసేవ మానేస్తే లాభా లేవీ, పైరవీలేవీ?"

పద్మినికి అర్థమైనా, తెలియనట్టే చూసింది.

"నాసంగ తేమంటారు?"

"వాగ్దానమివ్వను, సంఘసేవే చేసుకోమంటాను, వుద్యోగ మెందుకూడిందసలు. గాడినబడి వెళ్ళలేదా?"

'మరోసారి వస్తాలెండి, కోపంగా వున్నారు.' పద్మిని కాగితాలు బాగ్‌లో పెట్టుకుని వెళ్ళిపోయింది.

శర్మకి ఆకలిగా లేదు, థీసిస్ రివైజ్ చేశాడు. సద్దు తుండగా వుత్తరం గుర్తొచ్చింది. విప్పని వుత్తరం విప్పాడు. మరో అత్తకొడుకు గోపాలం వ్రాశాడు. అతనూ శర్మయీడే. అనవసరంగా వుత్తరం పడేయడు.

"బావకు,

నాకిక్కడ వుద్యోగం దొరకటం దేవుడికి కన్నుకుట్టింది వెంకటేశ్వరుడు జానికమ్మ దొడ్డమ్మకి కలలో కనబడి, గోపాలం తిరుపతి దేవస్థానంలో వుద్యోగం చేస్తూ, అప్పులు లేకుండా, సుఖంగా వున్నాడని చెప్పాడుట, అత్తయ్య కట్టుగుడ్డలతో వచ్చేసింది. దేవుడు చెప్పాకపోతే యెలా వస్తుంది? నేను హాస్టల్‌బిల్ చెల్లించలేక, సత్రం గదిలో చేరినప్పుడు, ఒక్కపూట

భోజనంతో రోజులు దొర్లించినప్పుడూ, నే నెక్కడున్నానో అత్తయ్యకి తెలియదు. పరీక్ష ఫీజుకి డబ్బులేక వాచీ అమ్ముకున్నాను. పరీక్ష వ్రాసి యింటికి వస్తే, యింట్లో అందరూ జబ్బుపడి వున్నారు. నాకు వుద్యోగం లేదు, చాకిరీ అయినా చేద్దామని, గిన్నెలు తోమటం, కల్లాపిచల్లటం, వంటా పెట్టా, పథ్యం పెట్టటం, హాస్పటల్‌నించి మందులు తేవటం, అన్నీ చేసి గూడా మెప్పు పొందలేక పోయాను. ఇరవై పౌన్లు తగ్గాను. ఉద్యోగం రాగానే కొండెక్కినంత సంతోషించాను. ఆమె రాగానే చాలామంది చేరారు. రోజుకో మొక్కుబడి తీర్చుకుంటూ నాకూ్కడా క్షవరం చేశారు. 'ఇంటికెళ్ళి పంపిస్తా రైలు చార్జి లియ్యి" అన్నది.

'లేవు' అన్నాను ధైర్యం చేసి,

'నిన్ననేగా ఫస్టూ? జీతమంతా యేంజేస్తున్నట్టూ?

'అమ్మానాన్నా అప్పుచేశారుట, అది తీర్చేయాలి, పంపమంటే పంపాను.' అన్నాను.

"మీ పెద్దన్న పంపుతాడు, మీపెద్దక్క హాలాల మీదోచ్చేదీ లాక్కుంటారు, అందరూ పంపాలా? అంత ఖర్చున్నదా?" ఛార్జీలిచ్చేదాకా వెళ్ళే వుద్దేశం లేనట్టు కనబడింది. యెగువ తిరుపతీ, దిగువ తిరుపతీ తిరిగి తిరిగి సంబంధ మొకటి తెచ్చింది.

'పిల్లని చూడటానికి రా' అని కూచున్నది.

"పెళ్లామొస్తే చుట్టాలను గెంటేస్తుంది. అందుకని పెళ్ళాడను, రాను" అని మొరాయించాను.

శీను కికఠిడ వర్మినెంటు జాబ్ యిప్పిస్తే, తన శేషజీవితం వెంకటేశ్వరుని సన్నిధానంలో గడిపేస్తుందిట.

నొద్దమ్మ జీవిత శేషభాగం నా సన్నిధానంలో గడిపెట్టున్నది. ఈ చింతలో నేను మంచమెక్కక ముందు యీామె నిక్కడనించి పంపే వుపాయమేదైనా వుంటే తెలియజేయి, స్కాలర్‌వని వ్రాశాను.

గోపాలం."

# 7

శర్మ థీసిస్ పెట్టేశాడు. విదేశం వెళ్ళే ఛాన్సుగూడా వచ్చేట్టున్నది. ఉన్నిగుడ్డలకు యెయిర్ టికెట్టు కూ వీసా తెచ్చుకోటానికీ డబ్బుగావాలి. కొండయ్య యిప్పించేవాడే, యిప్పించగలడు. కాని అత్తయ్యకోసం ఖర్చుచేసిన డబ్బు, అప్పు అనే అది తీర్చేయమనీ, నిలేశాడు.

"నేను నిన్ను యిమ్మనలేదు."

'మీ అత్తయ్య నాకు వ్రాయించిన పుత్తరంలో యేమున్నదీ నువే చెప్పావు.'

చెప్పాను గానీ, అది నే తీరుస్తాననలేదు.

అదితీర్చేదాకా ప్రాణాలు కొరికాడు కొండయ్య స్నేహం బెడిసింది. అప్పుతీర్చాక కొండయ్య నల్లపూస అయినాడు.

శర్మయేదైనా వుద్యోగంలో దూరాలని ట్రైచేశాడు, దూరినా వేలరూపాయలు మిగులుతాయా? ట్రైపుచేసినా స్వంత ఖర్చులకి సరిపోతున్నది, ఉగాది వచ్చేస్తున్నది. శర్మ చింతాక్రాంతుడైనాడు, లైబ్రరీకెళ్లాడు, బాస్వెల్ వ్రాసిన జాన్సన్ జీవితం చదువుతున్నాడు. జాన్సన్ అమూల్యమైన పార్లమెంటు స్పీచస్, అనువాదం చేసి, పేపర్లో వేసుకోమనీ, తోచిందివ్వమనీ బతిమాలితే పత్రికాధిపతిగానీ, పబ్లిషర్ గానీ ముందుకు రాలేదు.

శర్మ అణుపరిశోధన పాఠ్యపుస్తకం తెలుగులోకి అనువదించి అమ్మి డబ్బు చేద్దామా అని ఆలోచించాడు. అన్ని సబ్జెక్ట్సు తెలుగులో చెప్పాలని రూల్సు వస్తున్నై. సైన్సెస్ తెలుగులో చెప్పగలను అంటే బాగా డబ్బిచ్చే ట్యూషన్ అందుతుందేమో? ప్చ! పుణ్యకాలం గడిచిపోయి విదేశయానం ఆగిపోతుంది. లైట్లు వెలిగినై, శర్మ దణ్ణం పెట్టాడు, జాన్సన్ యిబ్బందులు చదువుతున్నాడు.

శర్మ బుజంమీద చెయ్యిపడింది, తలెత్తిచూస్తే కొండయ్య శర్మమనస్సు పొంగినా బెట్టుగా అన్నాడు.

"అప్పు తీర్చేశాగా, మళ్లా గాలం వేశావేం?"

"ష్! బైటికి రా ముందు. ఇక్కడరవగూడదు."

ఇద్దరూ యూనివర్సిటీ లైబ్రరీముందు రోడ్డుమీదికొచ్చారు, బస్సులు వస్తూ పోతూ వున్నాయి.

ఈ పార్టీకి రావాలి నువ్వు. కొండయ్య తన జేబులోంచి ఇన్విటేషన్ తీసియిచ్చాడు.

అది కలక్టరుగారు, గ్రామసేవికలకి, సంఘ సేవికలకూ ఉగాదిరోజున విందు యిస్తున్నట్టు అహ్వానం, కవర్‌మీద తన పేరుచూసి శర్మ అడిగాడు.

'ఇది నీచేతికెట్లా వచ్చింది, నాకు వాళ్లెవరూ తెలియదే? నన్నెట్లా ఇన్వైటు చేస్తారూ?'

అదంతా నీకనవసరం, నువ్వు వచ్చి తీరాలి.

'చెప్పనిదీ రాను, యేదో వు ప కా రం చేశానని డబ్బు డిమాండుచేస్తావు. మళ్లా కాబూలీవాలా నడిరోడ్డుమీద నిలేస్తాడు.' తల అడ్డంగా తిప్పాడు.

కొండయ్య మందహాసం చేశాడు.

నీకు సినిసిజమ్ వున్నది, మరీబొత్తిగా బయటి ప్రపంచం చూడకుండా, లాబ్‌లో వుండే వాళ్ళలాగే మాట్లాడతారు. నేను కలెక్టరాఫీసులో జాబ్ సంపాయించాను. నమ్మకస్తుడని పేరు తెచ్చుకున్నాను. మంచి ట్యూటర్ని పట్టమ్మన్నారు కలక్టరు గారి అబ్బాయికి ట్యూషన్ చెప్పి ఎంట్రెన్సు పరీక్ష వ్రాయించాలి. మెడిడిసిన్‌లో సీటు రావాలి.

"దానికి విందుదేనికీ?" చిన్నబిడ్డలాగా అడిగాడు.

"గ్రామసేవికలను కొనియాడి, సంఘసేవికలను ప్రోత్సహించి, వారుచేసిన సేవలకు, బిరుదుపట్టా యిచ్చి, 'మీరు చేసే సేవ అమూల్యమైనదీ' అని పెద్దల యెదుట కొనియాడితే, సేవికలు మరింత బాగా సేవ చేస్తారు. నీకంతా డి టె యి ల్డు గా చెప్పాలి ఖర్మ." కొండయ్య విసుకున్నాడు.

'తప్పేమిటీ? నువ్వు నన్ను దేంట్లో యిరికిస్తున్నావో తెలుసుకో వద్దూ? సేవికలు వాళ్ళలాభం వాళ్ళు చూసుకోరూ?' శర్మ బోబోయాడు.

కొండయ్య అతనికడ్డంవచ్చి బుజాలమీద చేతు లేసి అన్నాడు. "కొంపదీపి, విందులో యిలా మాట్లాడేవు. నోరు మంచిదైతే వూరు మంచిదౌతుంది. నీ విదేశయానానికి డబ్బు కావద్దా?"

'కావాలి.' దారిలోకొచ్చిన వాడిలాగా అన్నాడు శర్మ.

'ఇంకేంమరి, సేవికలు చేసే పని యెంతగొప్పదో వారెంత నిరాడంబరులో కలెక్టరుగారు చెప్పేటప్పుడు విందువుగాని. విని నేరుద్దువుగాని, ఉగాది పొద్దున తప్పక రావాలి.'

## 8

మామిడి తోరణాలతో, రంగుకాగితాల దండలతోనూ షామియానాకు శోభవచ్చింది. స్తంభాలకి, కొబ్బరి మట్టలను చుట్టి ముడివేశారు

కలక్టరుగారు పదింటికల్లా శర్మకు యింటర్వ్యూ యిచ్చారు. ఆయనకు ట్యూటర్ నచ్చాడు.

కొండయ్య రికమెండ్ చేశాడు.

'నా మిత్రుడు శర్మ, సార్! డబ్బుకోసం యీ ట్యూషన్ ఒప్పుకోలేదు. సార్. మీ అబ్బాయిగారికి సబ్జెక్ట్సు బాగా అర్థం గావాలనేదే మాశర్మ ముఖ్యోద్దేశం. పాఠమయాక మళ్లారివైజ్ చేయక్కర్లేదు అబ్బాయిగారు. నేను వీడి కోచింగు తీసుకునే ఫస్టాక్లాస్ తెచ్చుకున్నాను. అబ్బాగారికి తప్పకుండా మెడిసిన్ లో సీటువస్తుంది. యెబౌ లైన్ టీ మార్క్సు వచ్చేట్టు చెప్పగలడు నా మిత్రుడు.'

'ఇవాళనించే ట్యూషన్ మొదలెట్టేయండి. విందుకి వుండిపొండిద్దరూ.' అని కలక్టరుగారు దరహాసం చేసి, 'ఇన్విటేషన్ యిచ్చావా?' అన్నట్టు కొండయ్య వంక చూశారు.

కొండయ్య తలవూపాడు. 'ఇస్తాను సార్!'

కొండయ్య జనసముదాయంలో కలిసిపోయాడు, శర్మ బంగళాముందు పందిరికింద కూచుని చూస్తున్నాడు వన్నెవన్నెల చీరలతో, సరికొత్త అలంకరణంతో సేవికలు సందడి చేస్తూ తిరుగుతున్నారు. పెద్దమనుషులు హుందాగా కుర్చీలో కూచున్నారు. ఫ్యాన్సు హడావుడిగా తిరుగుతున్నారు.

కలక్టరుగారి సతీమణి వచ్చారు. అందరూ ఆసీనులైనారు. ఆమె నిలబడి వారి సేవలనూ నిజాయితీని, నిష్కామ కర్మనూ కొనియాడారు. వారికి యెదురుగా నిలబడి యిలా అన్నారు.

"రక్తదానం చేసినప్పుడు డబ్బు తీసుకోరాదు. దీనికి ప్రతిఫలం కోసం యెదురు చూడరాదు. గ్రామీణులకు పొదుపు పుద్యమం, కుటుంబ నియంత్రణ, సంతాన నిరోధం, చౌకలో ఆహారం తయారుచేసుకోటం వంటివి తెలియజెప్పాలి. నేర్పాలి వంటకాలు చేసి చూపాలి. బిడ్డలను బడికి పంపమని తెలియ జెప్పాలి. విద్యయొక్క ఆవశ్యకత చెప్పి, మధ్యవర్తులబారి పడకూడదని తెలియజెప్పాలి. ప్రాథమిక విద్యతోబాటు బడిలో పిల్లలకు, బలవర్ధకాహారమూ, పాలూ రాగి గంజీ యివ్వబడతా యనీ, పరిశుభ్రతా, డిసిప్లిన్ నేర్పుతారనీ జీతమిచ్చుకోక్కర్లే దనీ తెలియజెప్పాలి" అని ముగించారు

ఆ వుపదేశం పొంది, సేవికలందరూ లేచి, ముక్తకంఠం తో, అలాగే చేస్తామనీ రక్తదానంతో పాటు తక్కిన విధులూ నెరవేరుస్తామని ప్రమాణం చేశారు.

రక్తదానం చేసి మోచేతి మడతలమీద పట్టెలుచూసుకుని గర్వపడ్డారు సేవికలు.

కొండయ్య నవ్వుతూ వచ్చి శర్మని వెంటబెట్టు కెళ్లాడు.

"కలక్టరుగారు సమర్థులు, ఆఫీసర్స్‌క్లబ్, లయన్స్‌క్లబ్, రోటరీక్లబ్బ్లో మెంబరు. నీ విదేశయాత్ర ఖాయమౌతుంది.

ఆయన స్నేహితులూ ఆనెస్ట్ పీపుల్. విందు మొదలైంది. మనంగూడా వడ్డనలో పాల్గొని, సంఘసేవలో ఆసక్తి చూపాలి. రా." అని వడ్డన జరిగేవేపు తీసికెళ్ళాడు.

వంట చేసేచోట, సేవికలమీద అజమాయిషీ చేస్తూ హడావుడి చేస్తున్న జానికమ్మత్తయ్యను చూసి శర్మా కొండయ్యా నిలబడిపోయారు, ఇక్కడెట్లా వెలిసిందీ? అని చూస్తున్నారు.

ఆ సేవికలలో కొంతమందికి, శర్మతండ్రి సర్పంచ్ గా వున్నప్పుడు, వుద్యోగాలు శాంక్షన్ చేశాడు. శర్మను చూసి పలకరించారు.

అత్తయ్యను వో సారి చూసి శర్మ అడిగాడు.

"ఆవిడ మీకందరికీ లీడరా?"

గ్రామసేవిక సరోజిని, వోసారి జానికమ్మవేపు చూసి మళ్ళా శర్మవేపు చూసింది. నవ్వుతూ జవాబిచ్చింది.

'మరే, ఆవిడలేదని యీ విందు సజావుగా జరిగేట్టు చూచేవారెవరు? చాలా సమర్థురాలూ, అసాధ్యురాలూ, నిమిషంలో మనుషులతో కలిసిపోతుంది. బాగా పరిచయమున్నట్టు, బాంధవ్యంగూడా వున్నట్టూ మాటాడేస్తుంది. ఇవాళ కలక్టరు - రు సులభంగా అందుతారుగదూ, యేదో పని కావాలిట. చెప్పుకోటానికి వచ్చింది.

ఇతర సేవికలొచ్చి, వీళ్ళని లాక్కెళ్లారు.

విందు మొదలైంది. అరిటాకులు పరిచి మంచినీళ్ళ గ్లాసులుంచుతున్నారు. శర్మా కొండయ్యా, అన్నం పళ్ళెం పులావ్‌పళ్ళెం అందుకుని సర్వ్ చేస్తున్నారు. మూడో రౌండ్‌కి జానికమ్మత్తయ్య పులిహారపళ్ళెం శర్మచేతిలో వుంచింది. వేడి గోకర్ణం గరిటతో సహా కొండయ్య కందించింది.

"బాగున్నారా యిద్దరూ? నీకు డాక్టరేటు యిచ్చారా శర్మా! నీకు మంచి వుద్యోగమైందిటగా కొండయ్యా!" నవ్వుతూ చెప్పకెళ్ళింది.

"మీరిద్దరూ కల్పించుకోబట్టి నా పిల్లలిద్దరూ పాసైనారు. సాంబు పెళ్ళి అయింది, మీకు శుభలేఖపంపే టైం లేకపోయింది. శీను వుద్యోగంలో చేరాడు" మళ్లా నవ్వింది, అచుట్టూ తిరుగుతూ పనులలోవున్న సేవికలను చూస్తూ అన్నది.

"యేదో వీళ్లతో తిరుగుతూ వుంటే, నాచేతనైనసేవ నేనూ చెయొచ్చు. శీనుకు పెళ్ళి, చిన్న యిల్లు, కొంచెం పొలం యేర్పడతాయి. వాడో యింటివాడై స్థిరపడితే నాకింకేం కావాలిగనక. పొండిద్దరూ, వడ్డన అందటం లేదు." అని వాళ్ళిద్దర్నీ పంపేసింది.

ఫక్కపక్కనే నడుస్తూ, సర్వ్‌చేస్తూ మొహాలు చూసుకుంటూ, శర్మా కొండయ్యా అంటున్నారు,

"నిజమే కొండా! నువ్వన్నట్టు, అత్తయ్య ఆచరణలో పెట్టినట్టు, సంఘసేవే గొప్పది."

"నిజమంటాను. నాకు లక్ష కట్నంతో, వొంటెడునగలతో చదువుకున్న భార్య రావచ్చు. నేను కలక్టరుగారి పి. యె. కావచ్చు."

గబగబా భోజనాలు కానిస్తూ, స్వేచ్ఛగా పరాచికాలాడుకుంటూ సేవికలు చేసే ధ్వనులో వీళ్ళమాటలు కలిసిపోయినై.

[-*-]